Telanganasamajam.com
# తెలంగాణ సమాజం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్: ఎడిటర్ : పి. రమేష్ సంపుటి : 02 సంచిక : 293 13 శుక్రవారం, డిసెంబర్ 2024 పేజీలు :08 వెల: రూ. 3.00

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చ

క్యాబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం



**హైదరాబాద్,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్ఠానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

## జైలులో గుండెపోటుకు గురయిన లగచర్ల రైతు

బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు

తెలంగాణ పోలీసులు మరో దారుణం

ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ

ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం

ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక

**హైదరాబాద్,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం:**

తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.


విద్యాలయాల వసతుల కల్పనలో

## కాంగ్రెస్ విఫలం

చలికి వణుకుతున్న విద్యార్థులు : ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

రాష్ట్రంలో గురుకులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు.


మిగతా 2 లో

రైతుకు బేడీలు

## వేయడం అమానవీయం

రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం

లగచర్ల రైతులకు అండగా ఉంటాం

గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు.



## మంత్రివర్గ విస్తరణపై హైమాండ్‌దే నిర్ణయం : మల్లు భట్టి విక్రమార్క

**ఢిల్లీ,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు మల్లు భట్టి విక్రమార్క గురువారం ఢిల్లీలో అల్పాహారం ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఢిల్లీలో ఈరోజు రాహుల్ గాంధీని కలవలేదని అన్నారు. తెలంగాణలో ప్రజాపాలన పట్ల 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. వందశాతం మంది ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉంటారనుకోవడం లేదని చెప్పారు. ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందని చెప్పారు. హైడ్రాకు ధనిక, పేద అన్న తేడా లేదని స్పష్టం చేశారు. ఎవరు చెరువులను ఆక్రమించిన వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు.


మిగతా 2 లో

## ఓటర్లను ఆకర్షించేందుకు ఆప్‌ఆద్మీపార్టీ హామీల వర్షం

ఎన్నికల్లో గెలిస్తే ప్రతి మహిళకు రూ.2,100



**న్యూఢిల్లీ,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడు పెంచింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ప్రకటిస్తోంది. ఇప్పటికే ఆటో డ్రైవర్లకు ఐదు కీలక హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ గుడ్ న్యూస్ చెప్పింది. వచ్చే ఎన్నికల్లో ఆప్‌ను గెలిపిస్తే 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకూ నెలకు రూ.2,100 అందజేస్తామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. గురువారం సీఎం అతిశీతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'ప్రతి మహిళకు రూ.1,000 ఇస్తామని గతంలో హామీ ఇచ్చాము. అయితే, కొంతమంది మహిళలు నా వద్దకు వచ్చి ద్రవ్యోల్బణం కారణంగా రూ.1,000 సరిపోవడం లేదని చెప్పారు. అందుకే వారి అభ్యర్థన మేరకు 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ నెలకు రూ.2,100 ఇస్తాం' అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలోకే ఈ మొత్తాన్ని జమ చేయనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణ సమాజం

# సంపాదకీయం

## కార్యకర్తల స్థానాన్ని ఆక్రమించిన వ్యూహకర్తలు

నేటి కార్పొరేట్ ప్రపంచానికి తగినట్టు రాజకీయ పార్టీలు మారుతున్నాయి. గతంలో పార్టీలోనే వ్యూహకర్తలు ఉండేవారు. పార్టీ విధానాలకు తగినట్టు ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించేవారు. అయితే ఇప్పుడు వారు మాత్రమే సరిపోతారని ఏ పార్టీ అనుకోవటంలేదు.. పదు నైన వ్యూహాల కోసం బయటి సంస్థలను ఆశ్రయిస్తున్నాయి. దేశంలోని చాలా రాజకీయ పార్టీలు వ్యూహకర్తల్ని, వ్యూహ సంస్థల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు వారి సేవ ల్ని పొందుతు న్నాయి. ఈ క్రమంలో పార్టీల పని తీరులో, నాయకుల వ్యవహార శైలిలో మార్పు స్పష్టంగా కనిపి స్తోంది. ముఖ్యంగా సామాన్య ప్రజలతోనే కాకుండా కార్యకర్తలతో భేటీలను నాయకులు తగ్గించు కోవటం ఒక ముఖ్యపరిణామం. ఫలితంగా పార్టీ కార్యకర్తల ద్వారా పబ్లిక్ మూడ్ తెలుసుకునే పద్దతికి దూరమయ్యారు. దాంతో ప్రజలు ఏమనుకుంటున్నారో వారికి ప్రత్యక్షంగా తెలియటం లేదు. తమ వ్యూహకర్తలో, సంస్థలో ఇచ్చే సమాచారం మీదే వారు ఎక్కువగా ఆధారపడుతున్నారు. దాంతో, ఎన్నికల్లో తమకు కలిసొచ్చే పరిస్థితుల కన్నా బెడిసికొట్టే సందర్భాలే ఎక్కువని తెలంగా ణ, ఏపీ ఎన్నికలు నిరూపించాయి.! పార్టీ టిక్కెట్లివ్వటం నుంచి ప్రచారాంశాలు, ప్రాధాన్యతలు, పదవులు, బాధ్యతల కేటాయింపు వరకు అన్నీ వ్యూహకర్తలు-సంస్థలు సర్వే జరిపి ఇచ్చే సమాచారం ఆధారంగా చేస్తున్నారు. ఒకోసారి సర్వే బూచి చూపి నాయకులతో తమ ఇష్టాయిష్టాలను అమలు చేయిస్తుంటారు. ఇక, పార్టీ గెలిస్తే తమవల్లే అంటారు...ఓడితే మాత్రం బాధ్యత వహించవు. 2019లో వైసీపీ 151 స్థానాలు గెలిస్తే, అది తమ క్రెడిట్‌గా చెప్పుకున్న ఐప్యాక్ ..2024లో అదే పార్టీ, 11 స్థానాలకు పడిపోయినపుడు ఓటమికి కూడా సమాన బాధ్యత వహించాలి కదా! కర్నాటకలో, తెలంగాణలో ఆనాడు నెలకొన్న రాజకీయ పరిస్థితులు వాతావరణం కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి కారణమయ్యాయి. కానీ, అదంతా తాము నమ్ముకున్న వ్యూహకర్త గొప్పతనమనుకొని పార్టీ వ్యవస్థ మొత్తాన్ని ఆయన చెప్పుచేతల్లో పెట్టింది. ఫలితం..హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘోర పరాజ యం. కాబట్టి ప్రజాదరణ ఉండాలే తప్ప వ్యూహం పన్ని, ప్రభుత్వాధికారుల్ని బదిలీ చేసినట్టు అభ్యర్థులను అటు ఇటు మారిస్తే గెలవరు. రెండు వేల సంవత్సర మొదటి దశకం నుంచి ఈ అవలక్షణాలు మొదలయ్యాయి. పార్టీ కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ సామాజిక వర్గాల- వృత్తుల నాయకుల మాటల్ని రాజకీయ పార్టీలు పరిగణనలోకి తీసుకోవడం లేదు, నేతలకు జనంతో సంపర్కం పోయింది. నెహ్రూ, ఇందిర, వాజ్‌పేయ్ వంటి కేంద్ర నాయకులతో పాటు చెన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఎన్‌టిఆర్, వైఎస్ఆర్ వంటి రాష్ట్ర నాయకులు వివిధ పద్ధతుల్లో జనంతో కలిసిపోయారు. ప్రజల మనోగతంపై పార్టీల స్థాయిలో మథనం జరిగేది. జనాభిప్రాయం తెలుసుకొని, అవసరాలు తీరుస్తూ వారి విశ్వాసం పొందడం ద్వారా గెలవాలనే తలంపే క్రమంగా మరుగునపడుతోంది. పార్టీలు నియమించుకునే వ్యూహకర్తలు -సంస్థల్లోని అత్యధికులు మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినవారు. కనీసం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను కూడా సమీపంగా చూసి ఉండరు. ప్రజల్ని కేవలం ఓటర్లుగా, ఇంకా చెప్పాలంటే మార్కెట్‌గా చూసే వారి కంటికి రాజకీయ పార్టీ ఒక కమోడిటీగా మారింది. దానిని ఎలాగైనా కొనిపించటమే వారి పని! ఇక్కడ కొనపించటమంటే జనం తో ఓట్లేయించటం. ఈ పొలిటికల్ మార్కెటింగ్ ఎవరు బాగా చేస్తే వారే ఎన్నికల మార్కెట్లో నిలబడతారు. అందుకే, వారి నైపుణ్యాల అమ్ములపొది నుంచి స్కీంలు, రిబేట్లు, డిస్కౌంట్లు, ఆఫర్లు వచ్చాయి. నవరత్నాలయినా, గ్యారెంటీలయినా..వీటి మూలాలు ఈ వ్యూహకర్తల వ్యాపారపు మెదళ్ల నుంచి పుట్టినవే. ఇండియా షైనింగ్, నుంచి బై బై బాబు వరకు, ఇంటికో ఉద్యోగం నుంచి ప్రతి చేనుకు నీరు ప్రతి చేతికి పని వరకు, సబ్ కే సాత్ సబ్ కా వికాస్ నుంచి బాటింగేతో కాటింగే వరకు ప్రాసలతో కూడిన నినాదాల జోరంతా వ్యూహకర్తల చలువే! నినాదాలతో ప్రజల్ని అమాయ కులను చేసి తమ వైపుకు లాక్కోవాలనుకోవటానికి బదులు.. జనం అసలు ఏం కోరుకుంటున్నారో గ్రహించి, అవి తమ విధానాలుగా ప్రకటించే చొరవ రాజకీయ పార్టీల్లో ఉండాలి. కానీ దురదృష్ట వశత్తు ఇప్పుడు వాటిలో అది తగ్గుతోంది. రాజకీయం వ్యాపారం కాదు, సేవ అనే స్పృహ లోపిస్తోం ది. వ్యూహకర్తల ఎత్తులు-జిత్తుల కన్నా ప్రజల మనోభావాలే తమ రాజకీయ మనుగడను శాసిస్తాయ నే వాస్తవాన్ని పార్టీలు మరచిపోతున్నాయి. కార్యకర్తల్ని లక్ష్యపెట్టడం లేదు. రాజకీయ పార్టీలు ఒకప్పుడు సిద్ధాంతరీత్యా బలంగా ఉండేవి. విధానాలపై చర్చ, మేధో మథనానికి భేటీలు జరిగేవి. విధానపత్రాలు వెలువరించేది. ఎప్పటికప్పుడు శిక్షణా శిబిరాలుండేవి. 1995లో అధికార మార్పిడి తర్వాత సిఎం అయిన చంద్రబాబు, అటు ప్రజాక్షేత్రంలో నిరంతర కార్యక్రమాల్లో, ఇటు పార్టీ కార్యాలయంలో రోజూ సగటున రెండు, మూడు గంటలు గడిపేవారు. అధికారంలో ఉన్నా, దాదాపు అన్ని ప్రధాన పార్టీలకూ కార్యక్రమాలుండేవి. అట్టడుగు స్థాయి సమావేశాలు, ఇంటింటికీ వెళ్లటం, ప్రతి మనిషినీ కలవడం వంటివి తరచూ జరిగేది. వీటన్నిటి ద్వారా ప్రజలతో రాజకీయ నాయకులకు ప్రత్యక్ష బంధం ఏర్పడేది. అది వారి ఆలోచనా విధానాన్ని, పాలనా పద్ధతుల్ని ప్రభావితం చేసేది. ఇప్పుడేమీ జరగట్లేదు, జరిగినా తూతూ మంత్రంగానే! కాలేజీలు, యూనివర్శిటీల్లో 'విద్యార్థి రాజకీయాల' ద్వారా యువతరం రాజకీయాల్లోకి వచ్చే మార్గమొకటి ఉండేది. అక్కడ్నుంచి యువనాయకుల్ని పార్టీలు ఎంపిక చేసుకునే 'క్యాంపస్ సెలక్షన్' ప్రక్రియ అమలయ్యేది. ఫలితంగా ప్రజలనాడి ప్రాధాన్యత తెలిసిన యువతరం రాజకీయాల్లో క్రమంగా ఎదిగేది. పార్టీల్లో ప్రతి ఎన్నిక తర్వాత గెలుపోటముల్ని అధ్యయనం చేసే సమీక్షలుండేవి. చంద్రబాబు 27కు పరిమితమైనప్పుడు గానీ, జగన్మోహన్ రెడ్డి 11కు దిగజారినప్పుడు గానీ, కెసిఆర్ ఆరుమాసాల్లో రెండు ఎన్నికల్లో ఘోరంగా ఓడినపుడు గానీ నిజాయితీ సమీక్షలే జరుగలేదు. ఇక తప్పొప్పులు ఎలా తెలుస్తాయి? పార్టీల బలహీనతలు తెలుసు కాబట్టే వ్యూహ సంస్థలు, వ్యూహకర్తలు వారిని తమ బుట్టలో వేసుకుంటున్నారు. వారి బంధం కొనసాగుతూనే ఉంటుంది!

# విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం

మొదటి పేజీ తరువాయి

ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్ధతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు.

# మంత్రివర్గ విస్తరణపై హైమాండ్‌దే నిర్ణయం : మల్లు భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరగాలన్న నిబంధన లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ రూల్స్ మార్చారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు 11 నెలల్లో రూ.64 వేల కోట్ల అసలు వడ్డీ కట్టామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడే నాటికి ఏడాదికి రూ.6400 కోట్లు ఉంటే ఇప్పుడు ఏడాదికే రూ.64 వేల కోట్లు కట్టాల్సి వచ్చిందనిమల్లు భట్టి విక్రమార్కతెలిపారు. తమ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టింది అందుకే ప్రచారంలో వెనుకబడ్డమని అన్నారు. పదేళ్ల తర్వాత హాస్టళ్లకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. డిసెంబర్ 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ పాలన కంటే మెరుగైన పాలన తమ ప్రభుత్వంలో అందిస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# రైతుకు బేడీలు వేయడం అమానవీయం

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

## జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

## పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు సిద్దమైన కేంద్రం

**న్యూఢిల్లీ,డిసెంబర్ 12(తెలంగాణ సమాజం):**

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ %శీ% పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పధంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబు తున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది.నష్టాలు కూడా ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు. జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం. గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు. జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉంది. జమిలి

# నిర్వాసితులు ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి.

## రాష్ట్ర వ్యవసాయ,శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

## కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి

నగరంలోనేఅత్యంతవిలువైనప్రాంతంగారఘునాథపాలెంమండలం అభివృద్ధి

రైల్వేమూడవలైన్.ఏర్పాటుతోభూములకోల్పోయినవారికి రఘునాథ పాలెం మండలం

వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం తెలంగాణ సమాజం డిసెంబర్ 12:**

ఖమ్మం.రైల్వే మూడవ లైన్ క్రింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు,వారికి కేటాయించిన ఇండ్ల స్థలాలలో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని,వారికి అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి గురువారం మంత్రి, రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించారుఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రైల్వే 3వ లైన్ క్రింద పూర్తిగా ఇండ్లను కోల్పోయిన 58 మందికి వెంకటాయపాలెంలో 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీరికి పట్టాలతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని అన్నారు.నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, వీరికి అవసరమైన త్రాగు నీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్తు మొదలగు మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు అమరావతి వెళ్ళే జాతీయ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఈ ప్రాంతంలో వస్తాయని, ఇక్కడ భూములకు మంచి ధరలు పెరుగుతాయని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు సమీపంలోనే నిర్మాణం అవుతున్నాయని, మీ పిల్లలు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించిన పరిహారం సద్వినియోగం చేసుకుంటూ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఇక్కడ సమీపంలోనే కలెక్టరేట్ ఉన్నదని వైద్య కళాశాల, ఆసుపత్రి వస్తాయని ఈ ప్రాంతం చాలా విలువ కలిగిన ప్రాంతం అవుతుందని అన్నారు. ఖమ్మం నగరంలోని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే బాధ్యత, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాల్లో ఇళ్లను కోల్పోయే వారికి సైతం నగరం చుట్టూ మంచి స్థలాల్లో చూసి ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు,మునిసిపల్ కార్పొరేటర్లు తోట రాములు, కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం ప్రజలకు శాశ్వతం మంచి నీటి పరిష్కారం చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్.

## గ్రామ ప్రజల కోసం నీటి సమస్యను పరిష్కరిస్తాయి ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలు.


గత కొంతకాలంగా తిమ్మాపురం గ్రామపంచాయతీ లోని స్థానికులకు మంచినీటి ఎద్దడి ఉండడంవల్ల గ్రామంలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేయగా పరిష్కార మార్గం కోసం స్థానిక నాయకులు కోట ఈశ్వర్,కిషన్ నాయక్, ఎమ్మెల్యే బిఎల్ఆర్ కు సమస్యను వివరించగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీలో ఎస్సీ కాలనీ పడమటి తండా బీసీ కాలనీ రెడ్డి కాలనీలో గల శాశ్వత మంచి నీటి పరిష్కారం పరిష్కరించాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు.వారి ఆదేశానుసారం గురువారం తిమ్మాపురం గ్రామంలో ఆర్డబ్ల్యూఎస్ డి ఈ వెంకట్ రెడ్డి ఏఈ దినేష్ లు విస్తృతంగా పర్యటించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట ఈశ్వర్ దానవత్ కిషన్ నాయక్ బిల్ కలెక్టర్ కోట సైదులు బాజీ లకుపతి నాయక్ చత్రు నాయక్ స్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు బి ఎల్ ఆర్ బ్రదర్స్ తదితరులు ఉన్నారు.





# డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్ కార్యక్రమం.

## సత్వర న్యాయం కోసం మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి ఋవాడపల్లి ఎస్ఐ పి.హరికృష్ణ.



దామరచర్ల తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 12.

డిసెంబర్ 14 వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా అందజేసే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వాడపల్లి ఎస్ఐ పి.హరికృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న చట్టపరమైన కేసులను పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని,మెగా లోక్ అదాలత్లో ఎలాంటి ఖర్చు, జాప్యం లేకుండా కేసులకు తుది తీర్పును అందుతుందని తెలియజేశారు. న్యాయమూర్తుల పర్యవేక్షణలో జరిగే సెషన్‌లు, వివాదాలను వేగంగా మరియు న్యాయంగా పరిష్కరించేలా చూస్తాయని తెలియజేశారు.ముఖ్యంగా న్యాయం కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవడంలోని ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.ఏళ్ల తరబడి ఆలస్యమవుతున్న కేసుల్లో చిక్కుకున్నావారు లోక్ అదాలత్ న్యాయస్థానాలలో సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు అందుబాటులో సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుందని, సత్వర న్యాయం లక్ష్యం కావడంతో, ఈ చొరవ వివాదాలకు త్వరిత పరిష్కారాలను అందజేస్తుందని, వ్యక్తులకు సమాజానికి పెద్దగా ప్రయోజనం చేకూరుస్తుందని హామీ ఇవ్వడం జరిగింది. మండలంలోనీ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు చురుగ్గా పాల్గొనాలని ఎస్ఐ ప్రోత్సహించారు. ఇది సాధారణ సంక్లిష్టతలు మరియు వేచి ఉండే సమయాలు లేకుండా న్యాయపరమైన విషయాలను పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని,సకాలంలో న్యాయం జరిగేలా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.మెగా లోక్ అదాలత్ ద్వారా దీర్ఘకాలికంగా ఉన్న కేసుల పరిష్కారంతో పాటు ఎకొత్త వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి వేదిక, అందరికీ న్యాయం పొందే ఉచిత మరియు వేగవంతమైన పరిష్కార ప్రక్రియ నుండి ప్రయోజనం పొందేందుకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పెద్ద విజయ్ కి ఘన సన్మానం

## -డాక్టర్ రాసుమోల్ల వెంకటయ్య

నాగర్ కర్నూల్ తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 12

మహబూబ్ నగర్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పెద్ద విజయ్ కుమార్ ముదిరాజ్ , శ్రీశైలం దేవస్థానం మల్లికార్జున స్వామి దైవదర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో అచ్చంపేట మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రాసుమోల్ల వెంకటయ్య. స్వగృహానికి ఆహ్వానించి సన్మానంచి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, వారితోపాటు స్పాట్ న్యూస్ రిపోర్టర్ మెట్టుకాడి తెలుగు ప్రభాకర్ . తెలుగు సత్తా ఎడిటర్ ఆశన్న. తిమ్మాపూర్ నరసింహ.వారికి కూడా ధన్యవాదాలు తెలిపారు.



# మహిళా సంఘాలకు డ్వాక్రా భవనంను మంజూరు చేయండి...

## మహిళా సంఘాల విఓఏలు వేడుకోలు.

దోమ డిసెంబర్ 12 తెలంగాణ సమాజం రిపోర్టర్

మండల కేంద్రంలో మొత్తం నాలుగురు విఓలు,ఈ వీఓలకు 4 గ్రామ సంఘాలలో మొత్తం 125 గ్రూపూలు, సంఘాల గ్రూప్ ల సమావేశం ఏర్పాటుకు సరైన గది లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళా సంఘాల విఓఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల గ్రూప్ ల వారిగా నెలకు రెండు సమావేశలు ఏర్పాటుకు ఇబ్బంది కలుగుతుందని, అలాగే గ్రూప్ సంఘాల డబ్బులను బ్యాంక్ లకు చేరడానికి భద్రపరచ డానికి నానా ఇబ్బందులు పడాల్సివస్తుందని వస్తుందని వారు వాపోతున్నారు.సంబంధిత అధికారులు,ప్రజా పాలకులు మహిళా సంఘాల, డ్వాక్ర భవనం విషయంలో పట్టింపులేని విదంగా వ్యవహరిస్తు న్నారని దోమ గ్రామ విఓఏలు వాపోతున్నారు. డ్వాక్రా భవనం విషయంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకొని భవనన్ని మంజూరు అయ్యో విదంగా చూడాలని వీఓలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో వీఓఏలు, బిఎల్ఓలు చంద్రశేఖర్ గౌడ్,సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కొడంగల్ లగచర్ల రైతు జైలు లో కు గుండె పోటు వచ్చిన కూడా వదలని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం పాత్లావత్ గట్యా నాయక్

కొడంగల్ డిసెంబర్ 12 తెలంగాణ సమాజం రిపోర్ట్

తన భూమి కోసం పోరాడిన కొడంగల్ లగచర్ల ఫార్మా రైతు వీర్య నాయక్ కు సంగారెడ్డి జైల్లో గుండె పోటు వచ్చిన కూడా ఒక ఉగ్రవాది లాగా పోలీస్ వాహనం లో బేడిలతో హాస్పిటల్ కు తీసుకోవెళ్లడం చాలా దురదుష్టకారం బీఎంపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది రాష్టం లో అంబులెన్సులు లెవా పోలీస్ వాహనం లో మార్గమధ్యం లో వీర్య నాయక్ రైతుకు ఏమైనా జరిగి ఉంటే వారి కుటుంబ పరిస్థితి ఏమైపోయేది రైతులు ఎమైనా బంది పోటులా? భూములు ఇవ్వనందు అక్రమంగా కేసులు పెట్టి జైలు లో బందీలుగా చేసినారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల చేతిలో మీ పతనం తప్పదు తక్షణమే ఫార్మా రైతులను కేసులు ఎత్తి వేసి వారిని విడుదల చెయ్యాలి లేని యెడల బహుజన్ ముక్తి పార్టీ లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్టం లో అన్ని పార్టీ లను సామాజిక ప్రజా సంఘాల ను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తాము పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహిచాలి అని అన్నారు ఈ కార్యక్రమం లో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి బీఎంపీ చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జి గోవింద్ నాయక్, బీఎంపీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నేనావత్ హరి నాయక్, బీఎంపీ దోమ మండల అధ్యక్షులు కేతావత్ రవీందర్ నాయక్, యం బాబ్య నాయక్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు




# ఆటో డ్రైవర్లహెల్త్. క్యాంపు విజయవంతం జిల్లా కలెక్టర్ ముజుమ్మిలఖాన్

ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో డిసెంబర్ 12

ఖమ్మం.గురువారం ఆర్టీవో ఆఫీస్, భక్త రామదాసు కళాక్షేత్రం,నయాబజార్ కాలేజ్ , ఖమ్మం నందు ఆటో కార్మికులకు ఉచితంగా రక్త పరీక్షలు కలవు. వీటిలో అన్ని రకాల రక్త పరీక్షలను మన ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డిఎంహెచ్వో కళావతి ఇన్చార్జ్ ఆర్టీవో వరప్రసాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్వర్ణలత పాల్గొంటారు. కావున ఆర్థిక స్తోమత లేక రక్త పరీక్షలు చేయించుకోలేని ఆటో కార్మికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా నాయకులు అన్నారు జిల్లా ఉపేందర్ పాల్వంచ కృష్ణ ,నరాల నరేష్ పేరబోయిన మోహన్ రావు, రావుల శ్రీనివాస్, బోట్ల సాగర్ సీఐటీయూ , ఐ ఎన్ టి యు సి , ఏఐటీయూసీ టి యు సి ఐ %×%, మరియు ఇండిపెండెంట్ సంఘాలు, ఆటో యూనియన్ జేఏసీ ,ఆటో వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ





# క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్పు ముగింపు కార్యక్రమంలో

## ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి. నూకల వైశాలికి ఘనంగా సన్మానం.

దామరచర్ల తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 12.

రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్పు పేరున క్రీడలను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులు క్రీడాకారులు ఆటలో తమ నైపుణ్యతను పెంపొందించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని మండల ఎంపిడిఓ శ్రీనివాసమూర్తి అన్నారు.సీఎం కప్ మండల స్థాయి క్రీడోత్సవాలలో ముగింపు సభ ఎంఈఓ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రానికి నూకల వైశాలి మండలం నుండి రాష్ట్ర బాలికల జూనియర్స్ జట్టుకి కెప్టెన్ గా ఎంపీక అయినందుకుగాను, వివిధ టోర్నమెంట్ లలో ఏడుసార్లు ఆడడం జరిగిందని వైశాలి రాష్ట్ర జట్టుకు ఎంపికైనందుకు మన మండల చాలా గర్వపడాలని వైశాలిని చూసి మిగతా విద్యార్థులు భవిష్యత్తులో మీరు కూడా ఉన్నతమైన స్థానానికి వెళ్లాలని వారు తెలియజేశారు. అదేవిధంగా ఇప్పుడున్న స్పోర్ట్స్ కోట 3% పెంచడం వలన క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నూకల వైశాలిని శాలువాతో మూమెంట్ తో సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, పాఠశాలల పీఈటిలు నాగలక్ష్మి, రామ్ రెడ్డి, షమ్మీ ముక్తల్,సురేష్, రాము,తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల కోచ్ స్వాతి, నల్గొండ జిల్లా ఖోఖో కోచ్ నాగేశ్వరరావు తదోతరులు పాల్గొన్నారు.



# విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..

## - ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి .

తాండూర్ డిసెంబర్ 12 తెలంగాణ సమాజం రిపోర్ట్

గత రెండు రోజుల క్రితం తాండూరు మున్సిపల్ పరిధిలో సాయిపూర్ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ లో జరిగిన సంఘటనపై విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిలపై తెలుసుకొని దైర్యంగా ఉండాలని విద్యార్థులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి .అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తో కలిసి మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ... హాస్టల్ లో జరిగిన సంఘటన బాధాకరం, కానీ ప్రతిపక్ష నాయకులు దీనిని రాజకీయం చేస్తూ రాజకీయ లబ్ధి పొందలనుకోవడం సిగ్గు చేటు.విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో మాట్లాడటం జరిగింది,అందురూ కూడ ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారు.జిల్లా కలెక్టర్ మూడు రోజులుగా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.హాస్పిటల్ లో ఉంచుతే పిల్లలు భయభ్రాంతులకు గురి అవుతారనే ముఖ్య ఉద్దేశంతోనే పిల్లలను హాస్టల్ వాతావరణంలోనే ఉంచి పూర్తిగా నాణ్యమైన చికిత్స అందిస్తున్నాం.పిల్లలందరూ ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు, ఎవ్వరికైనా అత్యవసరం అయితే జిల్లా ఆస్పత్రిలో ఉంచి వైద్య సేవలు అందిస్తాము. పిల్లలకి నాణ్యమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉంది, దీనిలో భాగంగానే ఇప్పటికే మెస్ ,కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగింది.మీడియా కవరేజ్ కోసం ప్రతిపక్ష నాయకుల తాపత్రయం యావత్ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు..పిల్లలందరూ దేవతలతో సమానమని,ఇలాంటి విషయాల్లో రాజకీయం చేయడం మంచిదికాదని ప్రతిపక్ష నాయకులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.





తెలంగాణ సమాజం

## 0 1 0 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని అమీనాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

**డిసెంబర్ 12 వరంగల్ జిల్లా**

చెన్నారావుపేట మండలం అమీనాబాద్ మోడల్ స్కూల్లో జీరో వన్ జీరో పద్దు ద్వారా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని అదేవిధంగా నోషనల్ ఇంక్రిమెంట్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను ప్రొవైడ్ చేయాలని అమీనాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేయడం జరిగింది. హెల్త్ కార్డులు మరియు కారుణ్య నియామకాలు లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు కాబట్టి ప్రభుత్వం మోడల్ స్కూల్ ల పట్ల స్పందించి వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని అమీనాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పి .ఎం .టి.ఏ టిఎస్ మరియు టి .ఎం .ఎస్ .టి .ఎ బాధ్యులు జి .సురేష్ ,ఎస్ .మహేందర్ నల్లతీగల యాకయ్య ,యాకూబ్ సూరిబాబు,పి. సుధాకర్ జిల్లా బాధ్యులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ట్రైకార్ కార్యాలయం, హైదరాబాద్.

### తెలంగాణ రాష్ట్రంలో అందరికీ మంచి రోజులు వచ్చాయి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ట్రైకార్ కార్యాలయం లో కవులు కళాకారులకు ఘనంగా సన్మానం

**మహబూబ్ నగర్ (తెలంగాణ సమాజం ప్రతినిధి )డిసెంబర్ 12**

తెలంగాణ రాష్ట్రంలో అందరికీ మంచి రోజులు వచ్చాయి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సన్మానించిన కవులు కళాకారులకు గురువారం నాడు ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ట్రైకార్ కార్యాలయం లో ఉద్యమకారుల సమక్ష్యం లో మరోసారి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సన్మాన గ్రహీతలను ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం శ్రమించిన పలువురు కవులను కళాకారులను ఈరోజు మళ్లీ ఒకసారి ట్రైకార్ కార్యాలయం లో సన్మానించుకోవడం సంతోషంగా ఉందని కవులను కళాకారులను సన్మానించుకోవడం మన తెలంగాణ తల్లిని సన్మానించుకున్నట్లే ఉందని అన్నారు . కవులను కళాకారులను సన్మానించి గౌరవించుకోవడం మన సంప్రదాయమని, ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈరోజు ట్రైకార్ కార్యాలయం లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరి నింపి, తెలంగాణ కీర్తిని నలుదిశలా వ్యాప్తి చేసిన కవులను కళాకారులను తెలంగాణ ఉద్యమకారుల సమక్ష్యం లో మరోసారి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను అభినందిస్తున్నాను అని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యక్తి పూజకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చిందని ఎప్పుడు కూడా ఇలాంటి మంచి ఆలోచనలు చేయలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్, అందెశ్రీ, అశోక్ తేజ, పాశం యాదగిరి, సూర్యం, జయరాజు తదితరులు ఉన్నారు.



## మహాలక్ష్మి పథకం కింద రూ.. 2500 పథకాన్ని అమలు పరచాలి

### 500 రూ ..లకే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహిళలని సంతోషపరిచాయి

**(భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ సమాజం జిల్లా బ్యూరో)**

ప్రజా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలో ఉన్నటువంటి ప్రతి ,పేద మధ్యతరగతి మహిళల అకౌంట్లోకి 2500 రూపాయలు వేస్తామన్న హామీని అమలు పరుస్తారని మహిళలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని పదో వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ ప్రభుత్వాన్ని అన్నారు. గురువారం పదో వార్డులోని అంబేద్కర్ చమన్ లో జరిగిన భగత్ సింగ్, మదర్ తెరిసా మెప్మా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలో అమలు చేస్తున్నటువంటి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు వల్ల మిగిలే మొత్తాన్ని మనమందరం పొదుపు చేసుకొని పొదుపు సంఘాల ద్వారా వారి ఒక మహిళగా మన కుటుంబ అభివృద్ధి కోసం మనమే పాటుపడాలని ఆమె సూచించారు. పిల్లల పై చదువులకు మెప్మా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే గత ఐదు సంవత్సరాల నుండి వితంతువులైన మహిళలకు, 58 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ,వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు కాక అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం ఎప్పుడు అందిస్తుందో అని ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రజల యొక్క కోరికల కనుగుణంగా ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మెప్మా సమావేశంలో మెప్మా సీ వో శాంత కుమార్, చంద్రశేఖర్, మదర్ తెరిసా ఆర్పి ఎం కవిత, క్లస్టర్ ఆర్పి షబానా, బానోతు సునీత, ఆసిఫా అన్ని గ్రూపుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్.బి.ఐ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన కార్యక్రమం






**తెలంగాణ సమాజం వరంగల్ జిల్లా బ్యూరో ప్రతినిధి**

వరంగల్ జిల్లా, అలంఖానిపేట గ్రామపంచాయతీ ఆవరణంలో ఈరోజు శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా వారి సహకారంతో స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు, వ్యాపారులకు, యువకులకు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన కార్యక్రమం సోమవారం రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంక్ ఎఫ్.ఎల్.సి వరంగల్ జిల్లా కౌన్సిలర్ భాస్కర చారి మాట్లాడుతూ అందరు ఆర్థిక అక్షరాస్యత పైన పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, సామాజిక భద్రత పథకాలైన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన మరియు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సిబిల్ స్కోర్, సుకన్య సమృద్ధి యోజన, పి. ఎం. ఇ. జి. పి, ఎన్. బి. ఎఫ్. సి, ఫిక్సిడ్ /టర్మ్, డిపాసిట్ అకౌంట్స్, రిక్యూరింగ్ డిపాజిట్ అకౌంట్, కరెంట్ అకౌంట్స్, బి. ఎస్.బి.డి, టాక్స్ లిబిలిటీ ఆఫ్ ఎఫ్డి /ఆర్డి ఆకౌంట్స్, అకౌంట్ ఓపెనింగ్ అండ్ హౌ టూ డూ ట్రాన్సక్షన్స్, కే. వై. సి, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఇ-వాల్లేట్స్, యూ. పి. ఐ/ యూ. ఎస్. ఎస్. డి,/ఎ. ఇ. పి. ఎస్, లాకర్ ఫెసిలిటీ, లోన్ ఫెసిలిటీ, గవర్నమెంట్ స్కిమ్స్,సబ్సిడీ, గ్రీవెన్స్ రిడ్రస్స, ఆర్. బి - ఐ. ఒ. ఎస్, 2021, పేమెంట్స్ అండ్ సెటిల్మెంట్స్ ఇన్ ఇండియా, ఎన్. ఇ. ఎఫ్. టి, ఆర్. టి. జి. ఎస్, ఐ. ఎం. పి. ఎస్, బి. బి. పి. ఎస్, ఎన్.ఇ. టి. సి ఫాస్ట్ టాగ్ పథకాల పైన పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం ఐ. ఓ. బి. బ్యాంక్ ఆర్. డి. ఓ. రమేష్ చైర్మన్ శోభారాణి లు మాట్లాడుతు సైబర్ మోసాల పట్ల ఖాతాదారులందరు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1930 గుర్తుపెట్టుకోవాలని మరియు డబ్బు సంపాదించుకోవడం ఎంత ముఖ్యమో, దాచుకోవడం ఎంత ముఖ్యమో, కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని బ్యాంకు సంబంధిత ఓటీపీ, పిన్ మరియు వ్యక్తిగత అకౌంట్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, లింకులను నొక్కడం ఫార్వర్డ్ చేయడము చెయ్యకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత పోస్టులు పెట్టేముందు చాలా వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు గోల్డెన్ అవర్ ని గుర్తుకు చేసుకొని వెంటనే 1930 నెంబర్ కి ఉచితంగానె కాల్ చేసి న్యాయం పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మధు, మాజీ వైస్ ఎం. పి. పి. శ్రీనివాస్ మరియు సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈదునూరి రమేష్, ప్రాజెక్ట్ కోర్డినేటర్.ముబీన్ ఖాన్, మహిళా సంఘ ప్రతినిధులు వి. ఓ.లు అనిత, సావిత్రి, సి. ఎ. లు రవీందర్, రంజిత్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్స్ సౌజన్య, కీర్తన, కళాకారులు సాంబరాజు, రాజేందర్, స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, యువకులు, వ్యాపారులు మరియు బ్యాంక్ ఖాతా దారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గర్భస్థలింగనిర్ధారణవ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి ఆడపిల్లలరక్షణపైఅవగాహనకల్పించాలి





**ఖమ్మం తెలంగాణ సమాజంలో డిసెంబర్- 12**

ఖమ్మం.జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం అమలుపై జిల్లా మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అబార్షన్లు ఎక్కడ జరుగుచున్నాయో చూసి, ఫిర్యాదులు నమోదు చేసుకొని అన్ని శాఖల సహకారంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. నెలకొకసారి తనిఖీలకు తగిన ప్రణాళిక తయారుచేసి కార్యాచరణ చేయాలని తెలిపారు. కేసులు ఎక్కువగా ఎక్కడ నమోదు అవుతున్నాయో దృష్టి పెట్టి అక్కడ ఆడ పిల్లల రక్షణ (సేవ్ ది గర్ల్ చైల్డ్) పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆడపిల్ల పట్ల వివక్షత పై చర్చ జరిపి చైతన్యం తేవాలన్నారు. టీచర్స్, పేరెంట్ సమావేశాల్లో ఆడ పిల్లల రక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలను ఉదాహరణగా చూపాలన్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, బస్ స్టేషన్, మునిసిపల్ కార్పొరేషన్ తదితర జనసమ్మర్ధ ప్రదేశాలలో హోర్డింగ్స్ పెట్టాలని, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, కార్యాలయాల్లో నందు పోస్టర్స్, కరపత్రాలు ప్రదర్శించి అవగాహన కల్పించాలని అన్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా అధికారులు ప్రజలకు భేటీ బచావో, భేటీ పడావో పై అవగాహన పెంచి, ఆడపిల్ల పుట్టిన తల్లికి మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా గిఫ్ట్, స్వీట్ బాక్స్ లు పంచి వారిని ప్రోత్సహించాలని తెలిపారు. గ్రామాలలో గల ఆశ లు గర్భిణీ స్త్రీ లను గుర్తించే క్రమంలో ఎవరైనా అబార్షన్ చేయించుకొంటే వారి పూర్తి వివరాలను తెలుసుకొని, అవగాహన కల్పించాలని అన్నారు.సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ,చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి,అబార్షన్ జరిపితే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. మన జిల్లాలో కాకుండా పక్క జిల్లాల నుండి ఆర్ఎంపి లు ఇక్కడ అబార్షన్ చేయిస్తున్నారని వారికి డాక్టర్లు సహకరించి,తగిన కమీషనలు ఇస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వాటిని అరికట్టి, తగిన అవగాహన కల్పించి ఆడపిల్లను రక్షించాలని అన్నారు మండలంలో, గ్రామాల్లో, అన్ని శాఖ ల సమావేశాలలో సేవ్ ద గర్ల్ చైల్డ్ గురించి మాట్లాడాలని అన్నారు.సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ లీగల్ సెల్ కె వి. చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ, లీగల్ సర్వీస్ సెల్ ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేయనున్నట్లు, ఆడపిల్ల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి,డిసి హెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం అధికారులు డా.చందునాయక్, డా. వెంకటరమణ జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిపివో విష్ణువందన, ఐఎంఏ ప్రెసిడెంట్ డా. నారాయణ రావు, ఫోగ్సి డా.రహేనా బేగం,డెమో సాంబశివరెడ్డి,జాగృతి ఎన్జిఓ కుముదిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటనలు కాదు కావల్సింది.. పథకాలు

### ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా

**హైదరాబాద్, డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలతో కాలం గడుపుతుందని, కావల్సింది ప్రకటనలు కాదని పథకాలని అవి గుర్తుపెట్టుకుంటే మంచిదని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొటారన్నారు. కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరెంట్, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో? అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అమ్మల విషయంలో, అన్నదాతల విషయంలో వివక్ష చూపొద్దన్నారు. పథకాల అమలు ఎగవేతకు కారణాలు వెతకొద్దన్నారు.



తెలంగాణ సమాజం

# దరఖాస్తులన్నింటిని శాస్త్రీయ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక





రాష్ట్ర ఎస్సి ఏక సభ్య కమీషన్. చైర్మన్ డా.షమీమ్ అక్తర్ కమీషన్ సందర్శనసందర్భంగా దరఖాస్తుసమర్పించలేకపోయి నవారునేరుగాహైదరాబాద్.కమీషన్.కార్యాలయంల ోఅందజేయవచ్చు.ఏకసభ్య చైర్మన్ కలెక్టరేట్.లోబహిరంగవిచారణచేపట్టినఎస్సిఏకసభ్య కమీషన్. చైర్మన్

**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో, డిసెంబర్-12**

ఖమ్మం.షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై స్వీకరించిన దరఖాస్తులన్నింటిని క్రోడీకరించి దానిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని రాష్ట్ర ఎస్సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డా. షమీమ్ అక్తర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సి కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో బహిరంగ విచారణ నిర్వహించారు.పలువురు షెడ్యూల్ కులాల సంఘాలు, వ్యక్తులు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై దరఖాస్తులను కమీషన్ కు సమర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ,బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు,అభిప్రాయాలు అన్నింటిని శాస్త్రీయంగా అధ్యయనం చేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. దరఖాస్తు సమర్పించే వారందరూ ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా సమర్పించాలని కోరారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామని అన్నారు. ఇదివరకు రంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాలలో బహిరంగ విచారణ నిర్వహించడం జరిగిందని, జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్ లో నేరుగా కమిషన్ కు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నారు.షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై నిర్వహించిన బహిరంగ విచారణలో 450 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారు.అనంతరం చైర్మన్ ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలోని ఎస్సి కాలనీ ని సందర్శించి, అక్కడి ప్రజల స్థితిగతులను పరిశీలించారు. ఉపాధికి చేపడుతున్న పనుల గురించి, ప్రభుత్వం నుండి పొందుతున్న సహాయం గురించి, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం కలుగుతుందని చైర్మన్ తెలిపారు.అంతకుముందు ఎస్సి వర్గీకరణ పై బహిరంగ విచారణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ఎస్సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డా. షమీమ్ అక్తర్ కు ఎన్ఎస్పీ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్సి సంక్షేమ అధికారులు కె. సత్యనారాయణ,అనసూయ, ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్సి కార్పొరేషన్ ఇడిలు నవీన్ బాబు,ఉపేందర్ రావు,రాష్ట్ర కార్యాలయం సూపరింటిండెంట్ సజ్జన్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులు ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి.

## రాష్ట్ర వ్యవసాయ,శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

## కాలనీలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు కృషి





నగరంలోనేఅత్యంతవిలువైనప్రాంతంగారఘునాథవ ాలెంమండలం అభివృద్ధి

రైల్వేమూడవలైన్.ఏర్పాటుతోభూములకోల్పోయినవా రికి రఘునాథ పాలెం మండలం

వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించిన మంత్రి తుమ్మల


**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో డిసెంబర్ 12:**

ఖమ్మం.రైల్వే మూడవ లైన్ క్రింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు,వారికి కేటాయించిన ఇండ్ల స్థలాలలో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని,వారికి అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి గురువారం మంత్రి, రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించారుఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రైల్వే 3వ లైన్ క్రింద పూర్తిగా ఇండ్లను కోల్పోయిన 58 మందికి వెంకటాయపాలెంలో 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీరికి పట్టాలతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని అన్నారు.నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, వీరికి అవసరమైన త్రాగు నీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్తు మొదలగు మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు అమరావతి వెళ్ళే జాతీయ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఈ ప్రాంతంలో వస్తాయని, ఇక్కడ భూములకు మంచి ధరలు పెరుగుతాయని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు సమీపంలోనే నిర్మాణం అవుతున్నాయని, మీ పిల్లలు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించిన పరిహారం సద్వినియోగం చేసుకుంటూ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఇక్కడ సమీపంలోనే కలెక్టరేట్ ఉన్నదని వైద్య కళాశాల, ఆసుపత్రి వస్తాయని ఈ ప్రాంతం చాలా విలువ కలిగిన ప్రాంతం అవుతుందని అన్నారు. ఖమ్మం నగరంలోని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే బాధ్యత, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాల్లో ఇళ్లను కోల్పోయే వారికి సైతం నగరం చుట్టూ మంచి స్థలాల్లో చూసి ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు,మునిసిపల్ కార్పొరేటర్లు తోట రాములు, కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి నుంచి ఢిల్లీకి విమానసర్వీసులు

**అమరావతి,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

ఏపీలోని రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీ, ముంబాయి విమాన సర్వీస్ గురువారం నుంచి ప్రారంభమయ్యింది. ఢిల్లీ నుంచి రాజమండ్రి మధురపూడి ఎయిర్‌పోర్టుకు మొదటిసారిగా వచ్చిన ఇండిగో ఎయిర్ బస్‌లో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి రాజమండ్రికి వచ్చారు.ఈ సందర్భంగా విమానానికి వాటర్ కెనాన్లతో సిబ్బందితో స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇంతకుముందు ఢిల్లీకి, విదేశాలకు వెళ్లాలంటే విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌కు వెళ్లాల్సివచ్చేదని అన్నారు. ఇకపై ముంబాయి, ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి విదేశాలకు వెళ్లవచ్చని తెలిపారు. కాకినాడు ఎయిర్‌పోర్టు విషయంలో ల్యాండ్‌తో సహా ఫిజిబిల్టిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ తిరుపతి, షిర్డీ, జైపూర్, గుజరాత్ రాష్ట్రాలకు, ప్రధాన నగరాలకు బిజినెస్ కనెక్టివిటీని పెంచడానికి అవకాశముందని అన్నారు. 2027లో రాజమండ్రి పుష్కరాలకు కూడా విమానశ్రయాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

**తెలంగాణ సమాజం వరంగల్ జిల్లా బ్యూరో ప్రతినిధి**

చెన్నారావుపేట మండలంలోని పుప్పాల రజిత–ప్రదీప్ రెడ్డి పుత్రిక మను శ్రీ–ప్రణీత్ రెడ్డి ల పెళ్లి వేడుకలు నర్సంపేట సత్యం ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగిన ఈ పెళ్లి వేడుకకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను నిండు మనసుతో అక్షింతలు వేసి ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో బాల్నే వెంకన్న, యువ నాయకుడు కంది కృష్ణ చైతన్య రెడ్డి, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మాజీ జెడ్పి కో ఆప్షన్ ఎండి రఫీ, మాజీ ఎంపీటీసీ కేశవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, పర్ష రవి కిరణ్, సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ ఎన్నికలు పోలింగ్ స్టేషన్లు పరిశీలన

## ఎంపీడీఓ, శ్రీనివాసరావు.

## మీటింగులో బీఎస్పీ బుర్రి సాగర్ 07

**తెలంగాణ సమాజం వరంగల్ జిల్లా బ్యూరో ప్రతినిధి**

వరంగల్ జిల్లా నర్సంపేట లో సర్పంచ్ ఎన్నికలు రానున్నడంతో పోలింగ్ స్టేషన్లు పరిశీలన కోసం మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి పోలింగ్ స్టేషన్లు ప్రజలకు అనుకూలంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఏమైనా ఉంటే వాటిని మార్చి వేరే చోట పెట్టాలని ప్రతి పోలింగ్ స్టేషన్లో పరిశీలించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు తన ఓటు హక్కును వినియోగించుకో నేల సౌకర్యాలు కల్పిస్తూ ఏర్పాట్లు ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# గ్రూప్ 2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు పోలీస్ కమిషనర్

**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో డిసెంబర్ 12.**

ఖమ్మం కమిషనరేట్ పరిధిలో డిసెంబర్ 15 నుండి 16 వరకు జరిగే %ట+ూాజ% గ్రూప్–%××% పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 %దీచీూ% యాక్ట్ – 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.డిసెంబర్ 15 నుండి 16 వరకు 85 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్– %××% పరీక్షల సందర్భంగా డిసెంబర్ 15 ఉదయం 6:00 గంటల నుంచి డిసెంబర్ 16 సాయంత్రం 6:00 వరకు అంక్షాలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు,రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు అదేవిధంగా పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



తెలంగాణ సమాజం

# ఉగాది నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

### మునిసిపల్ కార్పొరేషన్ పరిధి డివిజన్ 32, 36 లు సీసీ రోడ్డు, డ్రైన్, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో డిసెంబర్ 12**

ఖమ్మం.ఉగాది నాటికి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్, సహకార,చేనేత జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.గురువారం మంత్రి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్తకి థియేటర్ రోడ్డులోని డివిజన్ 32, 36 లో రైల్వే నిధులు 3 కోట్ల 3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, కాలువలు,పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,పైప్ లైన్ నిర్మాణ పనులలో నాణ్యమైన సామాగ్రి వినియోగించాలని అన్నారు. డ్రైయిన్ లైన్ నేరుగా ఉండాలని, ఇక్కడ వేసే సిసి రోడ్లు పది కాలాల పాటు ఉండాలని మంత్రి ఆదేశించారు. పోల్ షిఫ్టింగ్, లైటింగ్ పూర్తయిన తరువాత సిసి రోడ్లు, డ్రైయిన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పనులను 3 నెలలో పూర్తి చేయడమే లక్ష్యంగా కాంట్రాక్టర్ కు పనులు అప్పగించాలని, ఉగాది నాటికి వచ్చి చూస్తే పనులు పూర్తయి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ప్రజాప్రతినిధులు బాలసాని లక్ష్మీనారాయణ దొబ్బల సౌజన్య కార్పొరేటర్ కమర్తపు మురళి , కార్పొరేటర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన ధాన్యం వేగవంతంగా కొనుగోలు చేయాలి

### జిల్లాకలెక్టర్. ముజమ్మిల్ ఖాన్ లాభసాటి పంటలదిశగా రైతులుదృష్టి సారించాలి

### రైతులకుఎటువంటికోతలులేకుండా ధాన్యంకొనుగోలు పూర్తి చేయాలికూసుమంచిగ్రామంలోధాన్యంకొనుగోలు కేంద్రాన్నిఆకస్మికంగాతనిఖీచేసినజిల్లాకలెక్టర్



**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో, డిసెంబర్ 12:**

ఖమ్మంకొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యతను పరిశీలించి తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం కూసుమంచి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలోని రిజిస్టర్ లను పరిశీలించిన కలెక్టర్, ఎంత ధాన్యం వచ్చింది ధాన్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా,కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకుతరలింపు, ధాన్యం కొనుగోలు వివరాలు ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ,ఎంత దిగుబడి వచ్చింది ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలుఎలా జరుగుతుందివాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తేమ శాతం రాగానే ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని,మిల్లుల దగ్గర ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వస్తుందని అన్నారు.రైతులు వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ పంటలో ఎటువంటి లేబర్ ఖర్చు ఉండదని,వాతావరణ సమస్యలు ఉండవని,ఎకరానికి లక్ష కంటే అధికంగా ఆదాయం వస్తుందని, దీనిపై అధికారులతో అవగాహన సమావేశం నిర్వహిస్తామని రైతులు పాల్గొని ఆయిల్ పామ్ సాగు చేయాలని కలెక్టర్ కోరారు.కూసుమంచి గ్రామంలో వరద సహాయం క్రింద పోయిన పొలాలకు పరిహారం అందలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# మంత్రి జ్యోతిరాధిత్య సింధియాపై అనుచిత వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పిన కళ్యాణ్‌బెనర్జీ

**న్యూఢిల్లీ,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**



టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ. డిజాస్టర్ మేనేజ్మెంట్ బిల్లుపై బుధవారం చర్చ జరిగిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. ఓ బిల్లుపై చర్చ సమయంలో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఆ సమయంలో కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. జ్యోతిరాధిత్య అందాన్ని వర్ణించారు. ఆ ఆవేశంలోనే ఆయన లేడీ కిల్లర్ అంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి తప్పుపట్టారు. ఎంపీ కళ్యాణ్ బెనర్జీ క్షమాపణలు చెప్పాలని సింధియా డిమాండ్ చేశారు. అయితే టీఎంసీ ఎంపీ కళ్యాన్ బెనర్జీ.. లిఖితపూర్వకంగా క్షమాపణలు చెప్పినట్లు గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. బుధవారం జరిగిన ఘటన దురదృష్టకరమని, ఎవరు కూడా వ్యక్తిగత ఆరోపనలు చేయరాదు అన్నారు. మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు అని, అది వారి హుందాతనాన్ని భంగపరుస్తుందని తెలిపారు

# వాలీబాల్ క్రీడలో రాణించిన మందిపాల్ గ్రామ యువకులు

### సీఎం సి యు పి వాలీబాల్ టోర్నమెంట్లో మందిపాల్ గ్రామం రెండవ బహుమతి గెలవడం సంతోషకరం:

**చౌడపూర్( తెలంగాణ సమాజం ప్రతినిధి )12**

ఉమ్మడి చౌడపూర్ కులకచర్ల మండలాలలో సీఎం పి యు పి హాలో భాగంగా పందిపాడు గ్రామం రెండవ బహుమతి గెలవడం వాలీబాల్ క్రీడల్లో మన గ్రామం పేరును మండల స్థాయిలో నిలబెట్టిన మందుపాల్ క్రీడాకారులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు అదేవిధంగా ఇంకెన్నో బహుమతులు ముందుగా సంపాదించాలని కోరారు అదే విధంగా మా గ్రామం తరపున మీకు సహాయ సహకారాలు అందిస్తామని ఒక ప్రకటన రూపంలో తెలియజేశారు వాలీబాల్ క్రీమ్ లో మన గ్రామం పేరును మండల స్థాయిలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు వాలీబాల్ డిస్టిక్ లెవెల్ లో సెలెక్ట్ అయిన ప్లేయర్స్ తిక్క మహేందర్ జొల్లు పవన్ కుమార్ వచ్చలి గణేష్ సెలెక్ట్ కావడం జరిగింది అదేవిధంగా కబడ్డీలో తిక్క మహేందర్ డిస్టిక్ లెవెల్ కు మందిపాల్ గ్రామం నుండి సెలెక్ట్ కావడం జరిగిందని ఒక ప్రకటన రూపంలో తెలియజేశారు.





# సోరస్, అదానీ అంశాలపై పార్లమెంట్‌లో గందరగోళం

**న్యూఢిల్లీ,డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**



లోక్‌సభలో గురువారం కూడా గందరగోళం నెలకొన్నది. సభ ప్రారంభమైన క్షణం నుంచి అధికార, విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్లు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తర్వాత.. జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులు ఉన్నట్లు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని ప్రభుత్వం తెలిపింది. దీంతో విపక్ష సభ్యులు ఆందోళన ఉధృతం చేశారు. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బీజేపీ నేత నిశీకాంత్ దూబే ఆరోపించారు. ఇండియాను నిర్వీర్యం చేసేందుకు సోరస్, కాంగ్రెస్ కలిసి పనిచేస్తోందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత ఒంటి గంట, ఆ తర్వాత రెండు గంటల వరకు సభను వాయిదావేశారు.

# తెలంగాణలో మూడు రోజులపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు

### తెలంగాణలో మూడు రోజులపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్ డిసెంబర్ 12 సంకల్ప వారధి ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మూడు రోజులపాటు అక్కడక్కడా ఉదయం వేళల్లో పొగమంచు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 3 రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో రానున్న 3 రోజులు అక్కడక్కడా చలిగాలులు వీస్తాయని వివరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# ఛతీస్‌ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## 12మంది మావోయిస్టులు మృతి

**బస్తర్, డిసెంబర్ 12 (తెలంగాణ సమాజం):**

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

# స్నేహితుడి తమ్ముడి పెళ్లికి వచ్చి తిరిగిరాని అనంత లోకాలకు

**వరంగల్ జిల్లా: డిసెంబర్ 12 తెలంగాణ సమాజం**

చెరువులోకి కారు దూసు కెళ్లిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందదు ఇటీవలనే వివాహం నిశ్చయమై మరో రెండు నెలల్లో పెళ్లి పీటలెక్కల్సిన వాడు స్నేహితుడి తమ్ముడి పెళ్లికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఈ విషాద ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లో నిన్న సాయంత్రం చోటు చేసుకుంది,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన మిరియాల విష్ణు (28) స్థానికంగా ఏఈవోగా పనిచేస్తున్నాడు.బుధవారం తన ఫ్రెండ్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి మరో ఫ్రెండ్ తమ్ముడి వివాహం కోసం నర్సంపేటకు వచ్చా రు. పెండ్లి పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో కారు సమీపంలోని కమలాపురం మాదన్నపేట చెరువు వద్దకు వెళ్లారు. చెరువు మత్తడి వద్దకు రాగానే కారు అదుపు తప్పి నీటి లోకి దూసుకుపోయింది.ప్రమాదాన్ని గుర్తించిన ప్రేమ్‌కుమార్ కారులో నుంచి దూకగా కారును డ్రైవ్ చేస్తున్న విష్ణు అందులోనే ఇరుక్కుపోయి చనిపోయాడు. విషయం తెలుసుకున్న నర్సంపేట పట్టణ సీఐ రమణమూర్తి, ఎస్సైలు శీలం రవి, అరుణ్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్రేన్ సాయంతో కారును,బయటికి తీసి, కారులో ఉన్న విష్ణు మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు..



# సీఎం కప్పు క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం

**కామారెడ్డి జిల్లా డిసెంబరు12 తెలంగాణ సమాజం ప్రతినిధి**

ఎల్లారెడ్డి. గాంధారి మండల స్థాయి సిఎం కప్ క్రీడలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసారు. చద్మల్ తాండ, నెరల్ గ్రామ క్రీడాకారులకు రెండు చొప్పున బహుమతులు గెలుచుకోవడం జరిగింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఎంపిక చేశారు. చద్మల్ తాండ నుంచి ముగ్గురు అమ్మాయిలు చిన్ని, మల్లిక, సరిత జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎఎంసీ ఛైర్మన్, పీస్ ఎస్ఐ ఎంపీడీవో, ఎంఇఓ, గాంధారి పాఠశాల హెచ్ ఎం మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.






# సర్కారు స్కూల్లో టీచర్లు లేక విద్యార్థుల ఇబ్బందులు!

**నాగర్ కర్నూల్ జిల్లాడిసెంబర్ 12 తెలంగాణ సమాజం ప్రతినిధి**

నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుందారం తండా ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు చదువుతు న్నారు. గత కొన్ని రోజుల నుంచి ఉపాధ్యాయులు రావడం లేదని ఆ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమకు తామే విద్యా బోధన చేసుకుంటున్నారు. రోజుకు ఒక టీచర్ చుట్టం చూపుగా వచ్చి వెళ్తుంటా రని, తమకు పాఠాలు చెప్ప కుండా తిని మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోండి అని చెప్తారని, విద్యార్థులు వాపోతున్నారు...ఉపాధ్యాయులు సమయపాలన కూడా పాటించరని తెలిపారు. ఈరోజు ఉదయం 9:30 దాటినా ఉపాధ్యాయులు రాకపోవడంతో వారే స్కూల్ తాళం తీసి ఊడ్చుకొని ప్రార్థన చేసి క్లాసులో కూర్చున్నారు.గ్రామస్తులు గమనించి విద్యార్థులను మందలించ డంతో విషయం వెలుగు లోకి వచ్చింది. సారోళ్లు రాకుంటే మేము ఐదుగురం స్కూల్ మానేస్తామని విద్యార్థులు చెబుతు న్నారు. ఈ విషయం పై వెల్దండ మండల ఎంఈఓను వివరణ కోరగా.. అక్కడ ఉన్న ఉపాధ్యాయురాలు గాయత్రి మెడికల్ లీవ్ లో వెళ్ళిందని తెలిపారు. ఆమె స్థానం ఇంచార్జ్ గా శ్రీశైలం అనే ఉపాధ్యాయు డిని నియమించాం అన్నారు. ఆయన లీవ్ లో ఉన్నారో ఏమో నాకు ఎలా తెలుస్తుందని సమాధానం చెబుతున్నాడు. విద్యాధికారి



# నల్లగొండ పట్టణంలోని 26వ వార్డులో బీజేపీ బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించిన ఎన్నికల ఇంచార్జ్ లోకనబోయిన రమణ ముదిరాజ్

**నల్గొండ (తెలంగాణ సమాజం ప్రతినిధి) డిసెంబర్ 12**

26 వ కౌన్సిలర్ గా బీజేపీ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి మహేశ్వరి ఈశ్వర్ గారి ఇంటి ప్రాంగణం లో ఈ రోజు 26 వ వార్డు లొని మూడు బూత్ లకి బూత్ కమిటీ ఎన్నికలు బీజేపీ పార్టీ నల్లగొండ పట్టణ డివిజన్ -3 ఎన్నికల అధికారి లోకనబోయిన రమణ ముదిరాజ్ పర్యవేక్షణలో జరుగగా 63 వ బూత్ అధ్యక్షునిగా గాదరి శ్రీకాంత్,64 వ బూత్ అధ్యక్షునిగా నారబోయిన సంజు, 65 వ బూత్ అధ్యక్షునిగా దాసరి శ్రీకాంత్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా లోకనబోయిన రమణ ముదిరాజ్ ప్రకటించడం జరిగింది, ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ మిరియాల వెంకటేశం మరియు ఎన్నికల అధికారి లోకనబోయిన రమణ ముదిరాజ్ లు మాట్లాడుతూ ఈ మూడు బూతులకు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాయకులు రాబోయే మున్సిపల్ ఎలక్షన్స్ లో 26వ వార్డులో బిజెపి పార్టీ తరఫున కౌన్సిలర్ గెలుపులో కీలక పాత్ర పోషించాలని వార్డులలో బిజెపి పార్టీ బలోపేతానికి విస్తృతంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ 6 పథకాల అమలులో ఘోరంగా విఫలమైనందున ఇవాళ ప్రజలందరూ కూడా బిజెపి వైపు చూస్తున్నారని ఈ మధ్య జరిగిన సర్వేలో బిజెపి పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ముందంజలో ఉన్నందున స్థానిక ఎన్నికలలో ప్రజలు బిజెపి పార్టీ కౌన్సిలర్స్ ను అత్యధిక సంఖ్యలో గెలిపించుకోవడం జరుగుతుందని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ పదవిని బీజేపీ పార్టీ కైవసం చేసుకోవడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శక్తి కేంద్రం ఇన్చార్జి దాసరి ఈశ్వర్, మహేశ్వరి, లకడాపురం వెంకటేశ్వర్లు, దాసరి యాదగిరి, 26వ వార్డు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నరసింహ కు ముదిరాజ్ సన్మాన సభ

**కల్వకుర్తి తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 12**

కల్వకుర్తి తలకొండపల్లి మండలంలో ముదిరాజ్ సన్మాన సభ తలకొండపల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు పల్లెమోని సుదర్శన్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా గీత నరసింహ ముదిరాజ్. ఎన్నికైన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఒక ముదిరాజ్ బిడ్డకు చైర్మన్ గా ఎన్నికైనందుకు తలకొండపల్లి మండల ముదిరాజులు ఈ కార్యక్రమాన్ని జరపడం జరిగింది ఈ సందర్భంగా ముదిరాజుల ఐక్యత గా ఉండాలని సభను ఉద్దేశించి మార్కెట్ చైర్మన్ గీతా నరసింహ ముదిరాజ్ మాట్లాడుతూ మండలంలో ముదిరాజులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమాన్ని వచ్చేసిన తలకొండపల్లి గ్రామ అధ్యక్షుడు బోలా బాలయ్య. మండల ప్రధాన కార్యదర్శి పుట్ట పాండు. తాలూకా ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్. మండల కార్యదర్శి నూకం మహేష్. యూత్ అధ్యక్షులు పుట్ట నాగరాజు. ముదిరాజ్ సంఘం పెద్దలు నూకం శేఖర్. సానముని పాండు. వెల్జాల్ సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణయ్య. మాజీ సర్పంచ్ భక్తి కుమార్. చంద్రధన బక్కి రాఘవేందర్. ఈసారి బాలకృష్ణ. నూకం శివ. సొసైటీ అధ్యక్షులు ఈ యాదయ్య. కె చెన్నకిష్టయ్య. చవిటి రవికుమార్. ముదిరాజ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# హైకోర్టు తీర్పు మత్స్యకారుల విజయం

## -డిఎల్ పాండు ముదిరాజ్ హైకోర్టు అడ్వకేట్

**తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 12**

తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు న్యాయవాది డిఎల్ పాండు ఈరోజు 1005 ప్రైమరీ సొసైటీలకు 21 జిల్లాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు మరియు రాష్ట్ర ఫెడరేషన్ కు ఎన్నికలు నిర్వహించాలని 8 జిల్లాల అధ్యక్షులు వేసినటువంటి పిటిషన్ పై హైకోర్టులో వాదనలు జరిగినవి వాదనలు విన్న హైకోర్టు స్టేట్ ఎలక్షన్ ఆఫ్ అథారిటీని నాలుగు వారాలు లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. మేము 8 జిల్లాల అధ్యక్షులు వేసిన పిటిషన్ పై హైకోర్టులో వాదనలు వినిపించి మాకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే విధంగా హైకోర్టు ఆదేశాలు ఇప్పించినందుకు హైకోర్టు న్యాయవాది డి ఎల్ పాండు ముదిరాజ్. కు తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు నూకం వెంకటేష్ ముదిరాజ్. డి ఎఫ్ సి ఎస్ నాగర్ కర్నూల్ జిల్లా డైరెక్టర్ గొడుగు బాల్ చందర్ ముదిరాజ్. పుట్ట వెంకటయ్య ముదిరాజ్. భయ్యా మల్లేష్ ముదిరాజ్. మొగులాన్ ముదిరాజ్. పాల్గొన్నారు.



# రుక్మద్దీన్ మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

## -మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**కల్వకుర్తి తెలంగాణ సమాజం డిసెంబర్ 12**

కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామంలో రుక్మద్దీన్ మరణం బి ఆర్ ఎస్ పార్టీకి తీరని లోటునిమాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని జీడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రుక్మిద్దీన్ గత వారం రోజుల కింద గుండెపోటుతో మరణించారు ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జీడిపల్లి గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి 10000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ రుక్మ దిన్ గ్రామ సర్పంచిగా ఎన్నో సేవలు అందించాడు గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడు అంతేకాక రుక్మద్దీన్ సేవలను గుర్తించి మండల కోఆప్షన్ సభ్యునిగా అవకాశం ఇచ్చామని తెలిపారు. ఆయన మరణించడం బాధాకరమని తెలిపారు. వారి వెంట టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భావనల మధు, కో ఆప్షన్ నెంబర్ మనోహర్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తలసాని కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ కాజా,మాజీ ఎంపిటిసి మల్లేష్ యాదవ్,టిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వట్టెపుకిషోర్, తాండ్ర తిరుపతి, వట్టేపుగణేష్ తదితరులు ఉన్నారు.



# గ్రూప్ -2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీఎస్

గ్రూప్ - 2 రాత పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

ఏర్పాటు పరీక్ష కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్-2023

సెక్షన్ అమలు పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహణ 21

పరీక్ష కేంద్రాలకు మొత్తం 7680 మంది హాజరు కనున్నారు

**మహబూబాబాద్ జిల్లా డిసెంబర్ 12 తెలంగాణ సమాజం**

పరిధిలో డిసెంబర్ 15,16 తేదీలలో జరిగే పీజీపీఎస్సీ గ్రూప్-%××% పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పీ సుదీర్ రాంనాధ్ కేకన్ ప్రకటనలో తెలిపారు.డిసెంబర్ 15 నుండి 16 వరకు జిల్లావ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్- %××% పరీక్షల సందర్భంగా డిసెంబర్ 15 ఉదయం 6:00 గంటల నుంచి డిసెంబర్ 16 సాయంత్రం 6:00 వరకు అంక్షలు అమలులో ఉంటాయని, లి పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. లి పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ గారు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.టువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# వైరల్‌గా మంచులక్ష్మి పోస్ట్

మంచు లక్ష్మి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. సందేశాత్మక పోస్ట్‌లు పెడుతుంటారు. వృత్తి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు నెటిజన్లతో పంచుకుంటూ ఉంటారు. అయితే, ప్రస్తుతం మంచు కుటుంబంలో తీవ్ర గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పరిణామాల వేళ మంచు లక్ష్మి పెడుతున్న పోస్ట్‌లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నిన్న తన కుమార్తె నిర్వాణ నవ్వులు చిందిస్తున్న వీడియో షేర్ చేస్తూ.. పీస్ అని క్యాప్షన్ ఇచ్చిన మంచు లక్ష్మి.. ఇవాళ ఓ మోటివేషన్ కొటేషన్ పంచుకున్నారు. 'ఈ ప్రపంచంలో ఏదీ మనది కానప్పుడు.. ఏదో కోల్పోతావనే భయం నీకెందుకు' అంటూ ఓ రచయిత రాసిన సందేశం షేర్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.



# నేను ఎక్కడికీ వెళ్లినా శాఖాహారినే – సాయిపల్లవి

ప్రేమమ్, ఫిదా సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసింది కోలీవుడ్ భామ సాయిపల్లవి. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న ఈ భామ శ్యామ్ సింగరాయ్ సినిమాతో హిందీలో కూడా ఎంట్రీ ఇచ్చింది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న సాయిపల్లవి ఓ సినిమా షూటింగ్ సందర్భంగా జపాన్‌లో తనకెదురైన ఓ సంఘటనను అందరితో షేర్ చేసుకుంది. చిట్‌చాట్‌లో సాయిపల్లవి మాట్లాడుతూ.. జపాన్‌లో ఒక నెలపాటు షూటింగ్ చేశా. అక్కడ శాఖాహారం దొరకలేదు. శాఖాహారంలో కూడా చికెన్ బ్రాత్ వాటర్‌తో వండారా..? అయితే నేను తినను ఫర్వాలేదన్నా.. ఎందుకంటే ఒక జంతువు చంపి తినడంలో వచ్చే ఆరోగ్యం నాకొద్దనిపిస్తుంది. అందుకే నేనెప్పటికీ శాఖాహారినే. నేనెక్కడికెళ్లినా శాఖాహారినే. ఓ జీవి చనిపోతే నేను తట్టుకోలేనంది. ఇంకో వ్యక్తిని హర్ట్ చేయడం.. పబ్లిక్‌గా ఇబ్బంది పెట్టానంటే నాకు నేను వెళ్లి ఏం అనుకోకండి అని చెప్తా. నాకు ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. నా ఎమోషన్స్ విషయంలో ఎప్పుడూ కాంప్రమైజ్ అవ్వను. రోజూ మెడిటేషన్ చేయకపోతే కొంచెం అన్‌బ్యాలెన్స్ (అసమతుల్యం)గా ఉన్నట్టు అనిపిస్తుందంటూ చెప్పుకొచ్చింది. ఇటీవలే అమరన్‌తో గ్రాండ్ సక్సెస్ అందుకున్న సాయిపల్లవి ప్రస్తుతం నాగచైతన్యతో తండేల్ సినిమాలో నటిస్తోంది. ఈ మూవీ 2025 ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# అమ్మతో హ్యాపీనెస్ మార్నింగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటించిన మోస్ట్ ఎవెయిటెడ్ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్2. సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన ఈ మూవీ డిసెంబర్ 5న తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైంది. ఓపెనింగ్ డే నుంచి నేటి వరకు వసూళ్ల వర్షంతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ చిత్రం కేవలం 7 రోజుల్లోనే రూ.1000 కోట్ల క్లబ్‌లోకి ఎంటరై రికార్డ్ వసూళ్లతో బాక్సాఫీస్‌పై దండయాత్ర చేస్తోంది. ఈ నేపథ్యంలో విజయోత్సవాల్లో పాల్గొనేందుకు అల్లు అర్జున్ టీం ఢిల్లీకి పయనమైంది. ఈ సందర్భంగా గురువారం ఉదయాన్నే తన తల్లి నిర్మలతో కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు బన్నీ. ఎంత అందమైన ఉదయం.. బిగ్ డే.. అందమైన ప్రారంభం.. అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. అద్భుతమైన విజయాన్ని అందుకున్న కొడుకును చూసి నిర్మల గర్వంగా ఫీలవుతూ సంతోషంలో కనిపించగా.. మరోవైపు తన తల్లిని చూసి ఆనందంలో మునిగిపోయాడు బన్నీ. ఇప్పుడీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో వచ్చిన సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

# 20న ప్రేక్షకుల ముందుకు ఉపేంద్ర

వినూత్న కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర. ఆయన పోషించే పాత్రలు కూడా విలక్షణంగా అనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న పీరియాడిక్ ఫాంటసీ చిత్రం 'యూఐ'పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. లహరి ఫిల్మ్స్ పతాకంపై జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. యూ/ఏ సర్టిఫికెట్ లభించింది. చాలా విరామం తర్వాత ఉపేంద్ర దర్శకత్వం వస్తున్న ఈ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లుంటాయని మేకర్స్ తెలిపారు. సమకాలీన సమాజంలోని సంఘటనలతో పాటు భవిష్యత్తు భారతంలోని సమస్యలను కథాంశంగా తీసుకొని తనదైన శైలిలో ఉపేంద్ర ఈ సినిమాను తెరకెక్కించారని, కొంతభాగం కథ 2040లో నడుస్తుందని, విజువల్స్ అబ్బురపరుస్తాయని చిత్ర బృందం పేర్కొంది. రీష్మా నానయ్య, మురళీశర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య తదితరులు ఈ చిత్రలో నటించారు.



# నయనతారకు మద్రాసు హైకోర్టు నోటీసులు



'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, తమిళ స్టార్ నటుడు ధనుష్ మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'నేనూ రౌడీనే' మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ ధనుష్ ఇటీవలే మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై దావా వేశారు. దీనిపై తాజాగా మద్రాసు హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై జనవరి 8వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు నయన్ దంపతులతోపాటు నెట్‌ఫ్లిక్స్‌కు నోటీసులు జారీ చేసింది. విఘ్నేష్ దర్శకత్వంలో వహించిన 'నానుమ్ రౌడీ దాన్'(2016) సినిమా నయన్ జీవితంలో కీలకం. ఆ సినిమా సమయంలోనే వారిద్దరూ ప్రేమలో పడ్డారు. అందుకే అందులోని సన్నివేశాలను, పాటలను డాక్యుమెంటరీలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో.. దానికి సంబంధించిన ఎన్‌వోసీ(అనుమతి పత్రం) కోసం ఆ చిత్ర నిర్మాతైన హీరో ధనుష్‌ని డాక్యుమెంటరీ మేకర్స్ సంప్రదించారు. రెండేళ్లపాటు పోరాడినా ధనుష్ మాత్రం అందుకు అనుమతి ఇవ్వలేదు. డాక్యుమెంటరీ స్ట్రీమింగ్‌కి వస్తున్న నేపథ్యంలో రీసెంట్‌గా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని మూడు సెకన్ల క్లిప్స్ ఉండటంతో, అందుకు నష్టపరిహారంగా 10కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ నయనతార టీమ్‌కు ధనుష్ లీగల్ నోటీసులు పంపారు. దాంతో మనసు నొచ్చుకున్న నయనతార.. ధనుష్‌కు భారీ లెటర్‌ని రాసింది. ఇందులో ఆయనపై తీవ్ర విమర్శలు చేసింది. దీంతో ఆగ్రహించిన ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నయన్ దంపతులపై దావా వేశారు.

# ముఫసాలో సత్యదేవ్ వాయిస్

హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్ ది లయన్ కింగ్‌కు ప్రీక్వెల్‌గా వస్తోంది ముఫాసా: ది లయన్ కింగ్. అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకత్వం వహించిన ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా సందడి చేయనుంది. ఈ సినిమాలో వన్ ఆఫ్ కీ రోల్ టాకా (సింహం) పాత్రకు సత్యదేవ్ వాయిస్ ఓవర్ అందించాడు. బ్రతికిపోయాం.. మనల్ని కాపాడింది నేనే.. టాకా పాత్రకు వాయిస్ ఓవర్ అందించిన వీడియోను సత్యదేవ్ షేర్ చేశాడు. అంతేకాదు ముఫాసా ది లయన్ కింగ్ సినిమాకు పనిచేయడం పట్ల తన ఎక్జయిట్‌మెంట్‌ను అందరితో షేర్ చేసుకున్నాడు. నాకు లయన్ కింగ్ అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ ఆ సినిమా చూసినప్పుడల్లా.. అందులో ఏదో ఒక పాత్రకు నేను వాయిస్ ఇవ్వాలని అనుకునేవాడిని. యానిమేషన్ సినిమాకు ఎప్పుడూ వాయిస్ ఇవ్వలేదు. కానీ తొలిసారి ఇచ్చాను. చాలా సంతోషంగా ఉంది.. అంటూ షేర్ చేసిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీ తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు వాయిస్ అందించాడని తెలిసిందే. హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు బాలీవుడ్ యాక్టర్ షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ అందించాడు.

